


సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల ప్రయివేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకుని ఆర్థిక సాయం కొరకు సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 27మందికి రూ.10,87,536 మంజూరయ్యింది. ఈ చెక్కులను బుధవారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణల చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు..



చెక్కులను అందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల, లీలా కృష్ణ

బతుకులు బుగ్గిపాలు

- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం
- ఆరుగురు సజీవ దహనం,
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఘటన

వారంతా రోజువారీ కూలీలు. కుటుంబ పోషణ నిమిత్తం ఊరుగాని ఊరొచ్చి పనులు చేసుకుంటున్నారు. దీపావళి కావడంతో బాణసంచా తయారీ కేంద్రాల్లో కూలీలుగా మారారు. కష్టపడి పనిచేసి ఈ దీపావళికి తమ పిల్లల కళ్లల్లో వెలుగులు నింపాలనుకున్నారు. కాని అనుకోని ప్రమాదం వారి ఇంట చీకట్లను నింపింది. బతుకులను బుగ్గిపాలు చేసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరో నలుగురు ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాయవరం మండలం కొమరిపాలెం గ్రామంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యూనిట్‌ను వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి నిర్వహిస్తున్నారు. దీపావళి సమయం కావడంతో బాణ సంచాను పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నారు. స్థానికులతో పాటూ అనపర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు ఈ యూనిట్‌లో రోజువారీ కూలికి పని చేస్తున్నారు. బుధవారం ఎప్పటిలానే యజమాని సత్యనారాయణమూర్తితో పాటూ వివిధ ప్రాంతాలకు చెందిన మరో 9 మంది కూలీలు ఈ యూనిట్‌లో బాణ సంచాతయారీలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఈ యూనిట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. క్షణాల్లోనే దట్టమైన పొగ కమ్మి మంటలు చెలరేగాయి. భారీ పేలుడుకు గోడ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. వీరిలో ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి(65), కూలీలు రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పాకా అరుణ(35), అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల(35), అనపర్తి సావరం గ్రామానికి చెందిన కుడిపూడి జ్యోతి(38), పెంకే శేషారత్నం(40) మృతదేహాలను గుర్తించారు. మరొకరిని గుర్తించాల్సి ఉంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొమరిపాలెంకు చెందిన



కాలిపోయిన మృతదేహాలు



దగ్ధమవతున్న యూనిట్

పొట్నూరి వెంకటరమణ, పెదపూడి మండలం వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ, అనపర్తికి చెందిన చిట్టూరి యామిని, సోమేశ్వరానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో, ఒకరు ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గుర్తుపట్టలేనంతగా...

ఈ ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. ప్రమాదం జరిగిన ఐదారు గంటల వరకూ మృతదేహాలను గుర్తించలేకపోయారు. మరో మృతదేహం పూర్తిగా కాలిపోవడంతో గుర్తుపట్టడం కష్టంగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు కావడంతో వారి ఆచూకీలను తెలుసుకోవడం కూడా పోలీసులకు కష్టమైంది. ప్రమాదం విషయం ఛానల్లు, సోషల్ మీడియాలో రావడంతో బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గుర్తుపట్ట లేనంతగా తమవారు కాలిపోవడంతో గుండెలవిసేలా రోదించారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన హోం మంత్రి

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాయవరంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనా ప్రాంతాన్ని బుధవారం రాత్రి సందర్శించారు. కాకినాడలోని సామర్లకోటకు విచ్చేసిన ఆమె అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా రాయవరంలో ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్‌పి రాహుల్‌మీనాలతో మాట్లాడారు. ప్రమాదానికి కారణాలపై ఆరాతీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఆమె వెంట అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఉన్నారు.

సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

బాణసంచా పేలుడు ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారనాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, క్షతగాత్రులకు వైద్య సాయం వంటి విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అగ్నిప్రమాద ఘటన బాధాకరం

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ఇవ్వాలి: సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కొమరిపాలెం గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం జరగడం బాధాకరమని, దీనిపై సిపిఎం జిల్లా కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తోందని జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకి సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తీవ్రంగా గాయపడిన వారికీ మెరుగైన వైద్యం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని, సంవత్సర కాలం క్రితం అమలాపురం నడిబొడ్డిలో ఇటువంటి ఘటనే జరిగిందన్నారు. మరలా ఇప్పుడు ఇటువంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. బాణసంచా సామగ్రి, నిలవ, తయారీ వంటి అంశాలపై జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగ వరలక్ష్మి, డి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



మలికిపురంలో ఆవిష్కరిస్తున్న ఎంఇఒ, జెవివి నాయకులు

ప్రజాశక్తి - రాజోలు

మలికిపురం ఎంఇఒ విజయశ్రీ జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్‌సంబరాలు పోస్టర్ ఆవిగోడపత్రిక ఆవిష్కరించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి పివివి.వరప్రసాద్ మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక విద్యార్థుల్లో చదువు పట్ల పోటీతత్వాన్ని, సైంటిఫిక్ ఆలోచనను కలిగించి, సైంటిఫిక్ జీవన విధానం అలవర్చుకు నేందుకు కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా విద్యార్థి చెకుముకి సైన్సు మాసపత్రికను నడుపుతోం దన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ పత్రిక సర్క్యులేట్ చేయ బడుతోందన్నారు. పిల్లలలో నిభిడీకృతమై వున్న సామర్థ్యాలను వెలికి తీయుటకు జనవిజ్ఞాన వేదిక 1988 నుంచి చెకుముకి సైన్సు సంబరాలను నాలుగు స్థాయిలలో నిర్వహిస్తోందన్నారు. అక్టోబరు 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల/పట్టణ స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీలలో రాష్ట్రస్థాయి నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా జెవివి మలికిపురం మండలం అధ్యక్షులు టి.చిట్టిబాబు చెకుముకి సైన్సు సంబరాలను రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు ఇచ్చారని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు విద్యార్థులను చెకుముకి సైన్సు సంబరాల్లో పాల్గొనేట్లు చేయాలని, విద్యాభివృద్ధికి జన విజ్ఞాన వేదిక చేసే కృషికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శేఖర్, జిల్లా కల్చరల్ కన్వీనర్ సిహెచ్.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, వెంకన్న బాబు చేతుల మీదుగా చెకుముకి టాలెంట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఎంఇఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 8, 9,10 తరగతిలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ భాషలలో ఈనెల 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న మండలస్థాయిలో, నవంబర్ 23న జిల్లాస్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఉపాధ్యాయులు, వివిధ సంస్థల సహకారంతో జన విజ్ఞాన వేదిక ఈ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవ రావు, పెద్దిరాజు, జి.నాగేంద్రప్రసాద్, ఎం.సత్య నారాయణ, రామ్ కుమార్, జిక్కిరిన్నస బేగం, సిహెచ్.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో పోస్టర్ ఆవిష్కరణలో విద్యాశాఖాధికారులు

కేశవస్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - యంత్రాంగం

ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ మరియు గోపాలస్వామి వార్ల ఆలయంలో బుధవారం ఆలయ ముఖ మండపంలో హుండీలను లెక్కించారు. పొడగట్లపల్లి, ఉప్పలపాటి జానకియమ్మ అన్నదానసత్రం ఇఒ మీసాల రాధా కృష్ణ పర్యవేక్షణలో 6 నెలల 19 రోజులకు లెక్కించారు. లెక్కింపులో రూ.11,96, 790 తోపాటు పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చాయని ఆలయ ఇఒ భాగవతుల వెంకట రమణ మూర్తి తెలిపారు. ఉమా కమం డలేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ.2,64,918 వచ్చిందన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

కేశవ మరియు గోపాలస్వామి వాళ్ళ ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహిం చేందుకు నిత్యాన్నదాన ట్రస్టుకు విశాఖపట్నం చెందిన ఇ.కృష్ణకాంత్ నాగమణి దంపతులు రూ.10,116 ఆలయ కార్య నిర్వహణ అధికారికి అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం దాతను సత్కరించారు.

బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలో బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలను కొత్తపేట ఎస్ఐ జి. సురేంద్ర బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు.రాయవరం మండలం కొమరి పాలెం గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగిన దష్ట్యా పోలీసులు ఈ తనిఖీలు చేశారు. బాణసంచా సామగ్రి తయారీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని షాపు యజమానులకు సూచించారు.

సిజెఐపై దాడికి నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

దేశ సర్వోన్నత న్యాయస్థానంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడాన్ని, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, న్యాయ వాదులు ఖండించారు. ఈ సందర్భంగా బుధవారం నిరసన తెలిపారు.

అమలాపురం: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ అత్యున్నత నాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ పై హిందూ మతోన్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి హేయమైన చర్య అని, దేశ ప్రజలందరూ సిగ్గుపడేలా జరిగిన దాడిని నిరసిస్తూ దళిత. ప్రజా. విద్యార్థి. మహిళ. కార్మిక. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాన్ని చూసి సిగ్గుపడేలా ప్రపంచ దేశాలన్నీ నివ్వెర పోయేలా మనువాద సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారనే అక్కసుతో మనదేశ ప్రధాన న్యాయమూర్తిపై హిందూ మత ఉన్మాది అయిన న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడం యావత్ దేశమంతా తలదించుకునేలా చేసిం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దళితుడు ప్రధాన న్యాయ మూర్తి ఇంతటి దారుణానికి ఒడి కడతారా ఇంత అవమానానికి గురి చేస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా దేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి స్పందించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని ఖండిం చాలన్నారు.దాడి చేసిన మతోన్మాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత రాజ్యాంగాన్ని రక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారం వెంకటేశ్వరరావు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్, ఉపాధ్యక్షులు ఆకుమర్తి రవి, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లెల్ల మనోహరం, అమలదాసు బాబురావు, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కొండా దుర్గారావు, మాజీ ఎపిపిఐ ఎన్.మల్లేశ్వరరావు, పెనుమాల చిట్టిబాబు, సాపే బాల రవి, గిడ్ల వెంకటేశ్వరరావు, దళిత సేన జాతీయ ఉపాధ్యక్షులు దుక్కుపాటి సత్యనారాయణ, జివి. రమణ, పెంకే వెంకటేశ్వరరావు, పీతల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.**ముమ్మిడివరం** దేశ అత్యున్నత న్యాయస్థానం సిజెఐ బిఆర్.గవాయ్ పై జరిగిన దాడి అమానుషమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్ పిఐ) పేర్కొంది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం.రుషి ఆధ్వర్యం లో తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు .అనంతరం జాతీయ రహదారి 216 పై దాడి చేసిన మతోన్మాద సనాతన వాది రాకేష్ కిషోర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. మతోన్మాది రాకేష్ పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజా స్వా మ్యాన్ని కాపాడాలని నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ గోపాల కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చీకురు మిల్లి శ్రీనివాస్, పంతగడి నరసింహ మూర్తి, దడల రామకృష్ణ, గిడ్డి జ్ఞాన ప్రకాష్, జనిపల్లి సత్యనారాయణ, దేవరపల్లి ఏడు కొండలు, ఉచ్చుల సాల్మన్ రాజ్, మెండి కష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ, బుధవారం రామచంద్రపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు, దళిత నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పిల్లి మురళీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు బి. సిద్ధూ, ఎం.రాము, వెంటపల్లి భీమశంకరం తదితరులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన నిందితుడు రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి..ధర్నాకు ముందుగా నేతలుఅంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, దళిత నాయకులు వెంటపల్లి రామకష్ణ, పైన సుధాకర్, మైనార్టీ నాయకులు జుల్ఫి, షఫీ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు రాజా రెడ్డి, అంబటి కృష్ణ వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అమలాపురం సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు



ముమ్మిడివరంలో సనాతన వాది దిష్టి బొమ్మ దహనం



రామచంద్రపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకుల ధర్నా

జూనియర్ కళాశాలను సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఆలమూరు


కొత్తూరు సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆర్‌డిఒ పి.శ్రీకర్ సందర్శించి సరిహద్దుల్లో జరుగుతున్న గోడ నిర్మాణాన్ని, సరిహద్దులను పరిశీలన చేశారు. స్థానిక విఆర్ఒను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఆర్‌డిఒ కళాశాలలో తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి కళాశాలకు గతంలో అదనపు తరగతి గదులను మంజూరు చేశారని, వాటి నిర్మాణం వెంటనే ప్రారంభిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆర్‌డిఒకు తెలియజేశారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తప్పకుండా తీసుకువెళతానని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, నేతలు సలాది నాగేశ్వర్రావు, గారపాటి త్రిమూర్తులు, గారపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడ పల్లి శ్రీ వెంకటేశ్వర వార్షిక 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి తరహాలో నిర్వహించేందుకు ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. 10 తేదీ శుక్రవారం నుండి 18 తేదీ వరకు 9 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాలను కూడా అధిక సంఖ్యలో యాత్రికులు రానున్న దష్ట్యా వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్య చక్రధ రావులు బుధవారం తెలిపారు. బ్రహ్మోత్సావాల్లో కార్యక్రమాలను తొమ్మిది రోజుల పాటు యాత్రికులు వీక్షించేలా వారికి అనుకూలంగా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. మొదటి రోజు పరవాసు దేవ అలంకరణలో శేష వాహనసేవ, రెండవ రోజు సరస్వతి అలంకరణతో హంస వాహనసేవ, 3వ రోజు కోదండరామ అలంకరణతో హనుమద్ వాహనసేవ, 4 వ రోజు యోగ నరసింహ అలంకరణతో సింహ వాహనసేవ, 5వ రోజు మల్లప్ప అలంకరణతో గరుడ వాహన సేవ, 6వ రోజు ఉదయం శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహనసేవ, రాత్రి మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహనసేవ, 7వ రోజు రాజాధిరాజా అలంకరణతో గజవాహనసేవ, 8వ రోజు ఉదయం కలపవృక్ష వాహనసేవ, రాత్రి కల్కి అలంకరణతో అశ్వ వాహనసేవ, చివరి 9వ రోజు భూదేవి శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి గోదావరి గౌతమీనది తీరాన చక్రస్నానం నిర్వహించనున్నారు. చివరి రోజు శనివారం కావడంతో సుమారు బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు లక్ష మంది యాత్రికులు పాల్గొంటారని ఆలయ అధికారులు అంచనా వేయడంతో వారికి అనుకూలంగా ఏర్పాట్లను పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటూ జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రతిరోజు 50 వేల పైబడి యాత్రికులు బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వస్తారని వారికి అనుగుణంగా ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే వెంకన్న ఆలయాన్ని మెరిమెట్లు గొలుపే విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు.

కార్టూ'నిజం'



పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి - రావులపాలెం

మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం స్వచ్ఛాంధ్ర పురస్కారాల గ్రహీతలకు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, కెఎస్. కృష్ణమాచార్యులు, రావులపాలెం డిపో మేనేజర్ వైవివిఎం.కుమార్‌ను జిల్లా స్థాయిలో పురస్కారాలు అందుకున్న కొత్తపేట ఎంపిడిఒ నరేష్ కుమార్, కొత్తపేట సిహెచ్‌సి డాక్టర్ జి.దుర్గా ప్రసాద్, గోపాలపురం గవర్నమెంట్ హోమియో డిస్పెన్సరీ డాక్టర్ అలుగుల రవి రాజశేఖర్, అవంతి ఫ్రోజన్ ఫుడ్స్ తరపున చిదంబరం, ఈతకోట ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ నుంచి భారతీకుమార్, మడికి ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.సుహాసినీరాణి, ఆలమూరు జిహెచ్ఎస్ బి.అప్పాజీ, జొన్నాడ అంగన్‌వాడీ కార్యకర్త గెద్దాడ ఆదిలక్ష్మి, ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు 596 మార్కులు సాధించిన కలవచర్లకు చెందిన విద్యార్థి పి మోహనకష్ణ, విద్యార్థి సోదరి 590 మార్కులు సాధించిన కావ్యశ్రీ దుర్గలను ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, గుత్తుల రాంబాబు, కేతా శ్రీను, ఈదల సత్యనారాయణ మూర్తి, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్, కుసంపూడి రామకృష్ణంరాజు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర పురస్కార గ్రహీతలను సన్మానించిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నియోజకవర్గంలో పలు రహదారుల అభివృద్ధికి నిధులు మం జూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం-కాట్రేనికోన వయా అయినాపురం రోడ్డు సుమారు పది కిలోమీటర్లు ఉండగా, అందులో ఐదు కిలోమీటర్లకు సుమారు రూ.3.90కోట్ల నిధులు మంజూరయ్యాయని, మిగిలిన ఐదు కిలోమీటర్లకు సుమారు రూ.4.48 కోట్ల నిధులు మంజూరు కావలసి ఉందన్నారు. అలాగే మురమళ్ళ ఎదురులంక వయ ఐ.పోలవరం రోడ్డుకు నిధులు విడుదలయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని ఎంఎల్ఎ సుబ్బరాజు తెలిపారు.

'సివి రామన్' రాంబాబుకు నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం సివి.రామన్ పాఠశాలలో సివి రామన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు రవణం రాంబాబు 5వ వర్ధంతి కార్యక్రమం బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. టిడిపి పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, పాఠశాల సిబ్బంది రాంబాబు కుటుంబ సభ్యులు రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ మాట్లాడుతూ విద్యారంగంపై ఎనలేని ప్రేమను రాంబాబు చూపించే వారిని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పైకి రావాలని తనతో చెబుతూ ఉండేవాడని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రవణం వేణుగోపాలరావు, సత్య కుమార్, సూర్య, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాంబాబు విగ్రహం వద్ద నివాళులఅర్పిస్తున్న స్కూల్ కరస్పాండెంట్, సిబ్బంది తదితరులు

నేరాలు ఘోరాలు

వేరు వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

వేరే వేరే ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారని తుని రైల్వేస్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారుత. బుధవారం గుడ్డుచర్ల రైల్వే లైన్ పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. అలాగే కొత్తూరు గ్రామ సమీపంలో 45 నుంచి 50 సంవత్సరాలు వయసున్న గుర్తు తెలియని మృతదేహం రైల్లే లైన్ వద్ద పడి ఉండగా గుర్తించినట్లు తెలిపారు. బయ్యవరం, కసింకోట రైల్వే స్టేషన్ మధ్యలో 23 సంవత్సరాల వయసుగల యువకుడు చెన్నై నుంచి హౌరా మెయిల్ ట్రైన్‌లో ప్రయాణం చేస్తూ జారిపడి మృతి చెందాడని తెలిపారు. అతని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మూడు మృతదేహాలను తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

బాలిక మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండలంలోని దమ్మెన్ను కాలువలోకి దూకిన బాలిక మృతదేహం మోర్త సరిహద్దు ప్రాంతంలో బుధవారం లభ్యమైంది. ఉంగ్రాజవరం ఎస్ఐ డి.రవి కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక మంగళవారం యథావిధిగా కళాశాలకు వెళ్లింది. బస్సులో తిరిగి ఇంటికి బయలుదేరింది. దారిలో బస్ దిగి, పక్కనే ఉన్న కాలువలోకి దూకేసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ డి.రవికుమార్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టంనిమిత్తం మతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నిల్వ ఉంచిన బాణసంచా సీజ్

ప్రజాశక్తి-గోకవరం

పోలీసులు దాడులు చేసి రెండు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని సీజ్ చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ పర్యవేక్షణలో కోరుకొండ సిఐ సత్యకిషోర్ ఆదేశాల మేరకు, గోకవరం ఎస్ఐ పవన్ కుమార్, ట్రైనీ ఎస్ఐ నాగమణి ఆధ్వర్యంలో గోకవరం, కొత్తపల్లిలో రెండు చోట్ల బుధవారం దాడులు నిర్వహించారు. రూ.40వేలు విలువ చేసే అక్రమంగా నిల్వ ఉంచిన బాణ సంచాను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

బాణసంచా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: అక్రమంగా నిల్వచేసిన బాణసంచాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్ఎస్.నగర్ లో బాణసంచా సామగ్రి నిలవచేశారన్న సమాచారం మేరకు రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్ తో కలిసి దాడి చేశామన్నారు. యర్రం శెట్టి మురళీకష్ణ ఇంటి పక్కన నిలువ చేసిన రూ.1,04,730 విలువ కలిగిన 203 కేజీల గంధకం, పొటాషియం, బొగ్గు పొడి, క్లోరైడ్, వంటి సంబంధిత సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశువుల కంటైనర్ సీజ్

ప్రజాశక్తి - కొవ్వూరు

ఎలాంటి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీని మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ పి.విజయకుమార్ తెలిపారు. పట్టణంలో గ్రామం ఇండియా టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అందిన సమాచారంతో కంటైనర్ లారీని తనిఖీ చేయగా దానిలో 32 పశువులను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. పార్వతీపురం నుంచి సూళ్లూరు పేటకు వీటిని తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. డ్రైవర్ నక్క వెంకట్రావు తో పాటు అతని సహాయకుడు గాది అంజిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులు ఇరువురు గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట గ్రామానికి చెందిన వారన్నారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను సామర్లకోట సమీపంలోని వి.వేమవరం గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

గాయపడిన తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడిన దొమ్మేరు గ్రామానికి చెందిన నీరుకొండ సుబ్బారావు అనే తాపీ మేస్త్రి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడనిపట్టణ హెడ్ కానిస్టేబుల్ మోటూరి సత్యనారాయణ తెలిపారు. గత నెల 22న సుబ్బారావు దొమ్మేరు సావరంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పై అంతస్తు నుంచి జారి పడ్డాడు. అప్పటి నుంచి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - రావులపాలెం

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కెవి.రమణరెడ్డి తెలిపారు. వివరాలు ఇవి.. గోపాలపురం గ్రామానికి చెందిన ఆరిపాక వెంకటేష్ రావులపాలెంకు చెందిన వివాహితను వెంటపడి వేధిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణరెడ్డి తెలిపారు.

విద్యుత్ స్తంభంపై పడిన కొబ్బరి చెట్టు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని శివల గ్రామం వద్ద బుధవారం వేసిన ఈదురు గాలులకు కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ స్తంభం పై పడింది. దీనితో మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మరో స్తంభం ఏర్పాటు చేసి లైన్లను పునరుద్ధరించారు.

అంతర్వేదిలో వైసిపి నేత రోజా పూజలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైసిపి నేత, నగరి మాజీ ఎంఎల్ఎ ఆర్‌కె. రోజా పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేశారు.

కొనసాగుతున్న చేనేత కార్మికుల రిలే దీక్ష



నినాదాలు చేస్తున్న చేనేత కార్మికులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

చేనేత బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 11వ రోజు కొనసాగింది. కపిలేశ్వరపురం మండలం అంగర శ్రీ గణపతి చేనేత సహకార సొసైటీ వద్ద చేనేత సంఘం కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహి ంచిన రిలే దీక్షలో చేనేత సంఘ నాయకులు శలా సుబ్రహ్మణ్యం, శలా వీర్రాజు బల్లా కోటేశ్వరరావు మా ట్లాడుతూ ప్రభుత్వం నుంచి సుమారు రూ.4 కోట్లు బకాయిలు రావలసి ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఏడాదికి రూ.25వేల సాయం హ్యాండ్ లూమ్‌కి 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి హామీలు ఇంత వరకు అమలు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావలసిన బకా యిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో పాల్గొన్న వారికి పలువురు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కట్టా రామారావు శలా వీర్రాజు, శలా లోకేశ్వరరావు,శలా కోటేశ్వరరావు,మత్స వీర గణేశ్వర రావు, తేలు సత్యనారాయణ, అధిక సంఖ్యలో సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

ఆలమూరు మండలాన్ని తూర్పులో కలపాలి



డిమాండ్ చేస్తున్న ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆల మూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ మండల ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. మండల కేంద్రం లోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపం వేదికగా సిపిఐ ఆలమూరు మండల కార్యవర్గ సభ్యులు వి.శామ్యూల్ అధ్యక్షతన బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. విద్య, వైద్యం అన్ని రంగాల్లో మండలానికి చెందినవారికి రాజమహేంద్రవరంతోనే అనుబంధం ఉండటంతో పాటు అమలాపురం దూ రంగా ఉండటం వల్ల మండలాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని, ప్రభుత్వం ఈ అంశాన్ని పరి గణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమ కార్యాచరణకు తగిన ప్రణాళిక రూపొంది స్తామని అన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి మండలాన్ని తూర్పుగోదావరిలో కలపాలని తీర్మా నాలు పంపిస్తామన్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నేత కె.రామకృష్ణ, బిఎస్‌పి నేత జి.కొత్తి య్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, అధ్యక్షులు వెంకట్, నేతలు కొపనాతి శ్రీనివాసరావు, మధుసూదనరెడ్డి, యేసురాజు, దడాల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే ఎస్ఐపిబి సమావేశానికి హాజరైన మంత్రి ఈ విచారకర సంఘటన విషయం తెలియగానే హుటాహుటిన బయలుదేరి రాయవరం చేరుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తొలుత ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బాణాసంచా తయారీ కర్మాగారాలు కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి అధికారుల నిర్లక్ష్యం ఉంటే తగు తీసుకుంటామన్నారు. మంత్రి సుభాష్ వెంట రామచంద్రపురం ఆర్‌డిఒ అఖిల, డిఎస్‌పి రఘువీర్, అగ్నిమాపక సిబ్బంది, కూటమి పార్టీ ఉండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘటన విచారకరం

మండపేట: రాయవరం మండలం కొమరిపాలెం లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే ఎంఎల్ఎ వేగుళ్ళ రాయవరం వెళ్లి అక్కడ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అగ్ని ప్రమాద ఘటన పై పూర్తి విచారణ చేపట్టి కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి


డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి - అయినవిల్లి

సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాగం గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు మంజూరైనా డ్రోన్‌ను బుధవారం ఎంఎల్ఎ గిడ్డి చేతులు మీదుగా శ్రీ రామ కృష్ణ గ్రూప్ సభ్యులకు అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - ఆలమూరు

ఒఎన్‌జిసికి భూములిచ్చిన రైతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్‌డిఒ పి.శ్రీకర్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన మండలంలోని పెదపల్ల, గుమ్మిలేరు మధ్యలో ఉన్న ఒఎన్‌జిసి సైట్ను పరిశీలించారు. అలాగే పెదపల్ల రైతులతో మాట్లాడారు. 14మంది రైతులు గత ఏడాది ఒఎన్‌జిసికి 15.52 ఎకరాలు అమ్మకం చేశారు. రిజిస్ట్రేషన్ కాకుండానే ఒఎన్‌జిసి శాశ్వత కట్టడాలు కట్టేస్తూ ఉండటంతో, రైతులు ఆందోళన చేస్తామని నోటీసులు ఇవ్వడంతో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు వారితో చర్చలు జరిపి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఆ గడువు కూడా ముగియడంతో బుధవారం ఆర్‌డిఒ శ్రీకర్ స్వయంగా వచ్చి ఒఎన్‌జిసి అధికారులు, రైతులతో చర్చించి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

ప్రజాశక్తి - కొత్తపేట

జిఎస్‌టి తగ్గింపు ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెపి.రాజు అన్నారు. కామర్స్ మరియు ఎకనా మిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు జిఎస్‌టి 2. వలన విద్యారంగానికి కలిగే ప్రయోజనాలతో పాటుగా ఇతర రంగాలకు కలిగే ప్రయోజనాలను కూడా వివరిం చారు. దీనివల్ల విద్యారంగంతో పాటు ఇతర నిత్యావసర, ప్రామాణిక వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయన్నారు. దీనివలన పేద మధ్యతరగతి కుటుంబాలకు డబ్బు ఆదా అవుతుందని మరియు ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి తగ్గించిన స్లాబులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు, వైస్ ప్రిన్సిపల్ టి. రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ జి. శ్రీనివాసులు, డాక్టర్ డిసిహెచ్ పాపారావు, డాక్టర్ కె.సత్యనారాయణ, సిహెచ్.నాగ శ్రీలక్ష్మి, వి.నాగదీపిక, ప్రసన్న జ్యోతి, భవాని సుకద వల్లి, సత్య, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

జాతీయ స్థాయి పోటీలకు మేఘన ఎంపిక

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కొత్తలంక జడ్‌పి ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతికి చెందిన గెద్దాడి మేఘన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్షిప్ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన పోటీలలో మేఘన ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన గిరి ఆధ్వర్యంలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ జైను బాబ్జీ, ఉపాధ్యాయులు మేఘనను ఘనంగా సత్కరించి, జాతీయ పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. అలాగే పోటీలలో పాల్గొన్న 14 మంది విద్యార్థిని, విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నారని శిక్షణ నిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ కొప్పిశెట్టి సుజాతను తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన అభిషేక్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ జిఆర్‌సి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న బోను అభిషేక్ బ్యాడ్మింటన్ పోటీలలో ఒకేసారి మూడు విభాగాల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించాడు. అనంతపురంలో ఈనెల 4 నుంచి 7 వరకు జరిగిన యోనెక్స్ సన్ రైజ్ ఎపి స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ అండర్ -17 పోటీలలో అభిషేక్, మ్యాన్ సింగిల్ విభాగంలో, బాయ్స్ డబుల్స్ విభాగంలో, అలాగే మిక్స్ డబుల్స్ విభాగంలో కలిసి మూడు క్యాటగిరీలలో విజేతగా నిలిచి ఈ ఘనత సాధించినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు బుధవారం విలేకరులకు తెలిపారు. బాయ్స్ సింగిల్స్ విభాగంలో కూడా అభిషేక్, రన్నర్‌గా నిలిచి సత్తా చాటినట్లు రావు పేర్కొన్నారు. అభిషేక్ భవిష్యత్తులో భారతదేశం గర్వించే క్రీడాకారుడు కావాలని జివి.రావు ఆకాంక్షించారు. అభిషేక్ మాట్లాడుతూ మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు తనను ప్రోత్సహిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో అంతర్జా తీయ పోటీలలో పాల్గొని విజేతగా నిలవడమే తన లక్ష్యమన్నారు. అనంతరం అభిషేక్ తండ్రి శేఖర్ మాట్లాడుతూ అభిషేక్‌ప్రతిభను బాల్యం నుంచే గమనించి తనను ప్రోత్సహించామన్నారు. అభిషేక్‌ను ఇంటర్మీ డియట్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహె చ్.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నూతన ఆత్మ కమిటీకి ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి - రావులపాలెం

నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్, సభ్యులుగా నియమితులైన వారందరికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అభినందనలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఆత్మ కమిటీ లో నియమితులైన వారిలో నియోజకవర్గ ఛైర్మన్‌గా జక్కంపూడి సీతారామకృష్ణ బాలాజీ, జిల్లా కార్యవర్గ సభ్యునిగా కుదప కృష్ణమూర్తి, సభ్యులుగా జనిపిరెడ్డి తాతారావు, బొక్కా శ్రీనివాసరావు, పసుపులేటి రాధాకృష్ణ, మట్టా వెంకటరమణ, నామాల దుర్గ,చల్లాబత్తుల సత్యవతి,కట్టా శ్రీనివాసరావు సఖినాల నాగజ్యోతి, సూర్యవరపు వీర వెంకటేశ్వరరావు, తదితరులు నియమి తులయ్యారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతుల సంక్షేమం వ్యవసాయాభివృద్ధి దిశగా ఆత్మ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.